గ్రామపాలన సాగేదెలా?

- పంచాయతీలకు నిధుల కొరత
- ఏడు నెలలుగా కార్మికులకు అందని వేతనాలు
- డీజిల్ లేక మూలనపడ్డ ట్రాక్టర్లు
- పంచాయతీ కార్యదర్శులకు తిప్పలు

గ్రామ పంచాయతీల ఖాతాలో నిధుల్లేక అభివృద్ధి పనులు జరగడం లేదు. పల్లెలకు కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే అన్న చందంగా మారింది. నిధులు లేక పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వని పరిస్థితిలో జీపీలు కొట్టు మిట్టాడుతున్నాయి. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అయితే నిధులు లేక గ్రామ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలో 25 గ్రామ పంచాయతీలున్నాయి. గతంలో మూడు నెలలకు ఒకసారి స్టేట్ ఫైనాన్స్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించేది. అలాగే 15వ ఫైనాన్స్ నుంచి కేంద్రం నుంచి నిధులు కేటాయించేది. ప్రస్తుత పాలకవర్గం లేకపోవడంతో విడుదల కావడం లేదు. దీంతో ప్రత్యేక అధికారుల పాలనలో కార్యదర్శులకు అవస్థలు తప్పడం లేదు. గ్రామాల్లో పారిశుద్ధ నిర్వహణకు ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్లు కేటాయించింది. వీటి నిర్వహణ కూడా ప్రస్తుతం ఇబ్బందిగా మారింది. డీజిల్, మరమ్మతులు చేయించకపోవడంతో వాటిని మూలన పెట్టారు. కార్యదర్శులు తమ సొంత డబ్బులు వెచ్చించి పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు.



పెద్దకోడూరు గ్రామ పంచాయతీ భవనం

పదవీ కాలం ముగియడంతో ..

పారిశుద్ధ్య కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు అందడం లేదు. వీరందరికీ జీపీ నిధుల నుంచి జీతాలు ఇవ్వాల్సి ఉంది. కాగా రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడం, గ్రామ పంచాయతీల పదవీ కాలం ముగియడంతో పాటు వివిధ కారణాలతో నిధులు విడుదల కాకపోవడంతో వీరందరికీ జీతాలు రావడం లేదు.

వేతనాలు రాక ఇబ్బందులు

మాకు ఏడు నెలలుగా వేతనాలు చెల్లించలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం స్పందించి వేతనాలు వచ్చేలా చూడాలి.

– ఎల్లవ్వ, కార్మికురాలు, పెద్దకోడూరు



నిధులు విడుదల చేయాలి

గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ట్రాక్టర్ రిపేర్లు, డిజిల్ తో పాటు వీధి దీపాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. పంచాయతీలకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే వరకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.

– రాజు, పంచాయతీ కార్యదర్శి, పెద్దకోడూరు

క్లుప్తంగా

వస్త్ర సంచులను వాడాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత


మున్సిపల్ వాహనంలో చెత్త వేయిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రజలు ప్లాస్టిక్ సంచులకు బదులు వస్త్రంతో చేసిన సంచులను వాడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత కోరారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా మంగళవారం పట్టణంలోని 11వ వార్డులో తెలంగాణ బాసిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెత్త విభజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు హ్యాండ్ గౌజులు, సెఫ్టీ జాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంతో భూ కాలుష్యం పెరిగి పర్యావరణానికి హాని కలుగుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలఎల్లం, పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, బాసిల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉదయ్, కో ఫౌండర్ రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప దేశభక్తుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి


మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ గొప్ప దేశభక్తుడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్రపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యాంప్రసాద్ ముఖర్జీ దార్శనిక దేశభక్తుడన్నారు. దేశం సమగ్రత, ఆత్మగౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. జమ్మూ కశ్మీర్‌ను దేశంలో అంతర్భాగం చేసే పోరాటంలో ఆయన త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం


మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రజల సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం చేస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి అన్నారు. ఆది, సోమవారాల్లో మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ శిక్షణా తరగతులకు సహకరించిన ప్రజలకు మంగళవారం ధన్యావాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం చేసే ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్, అత్తిని శారద, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్

కొండపాక(గజ్వేల్): లారీని బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని దుద్దెడ శివారులో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. దుద్దెడ గ్రామానికి చెందిన మల్లేష్ తన ద్విచక్ర వాహనంపై సిద్దిపేట వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాంగ్రెస్‌లో చేరిక

కొమురవెల్లి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సమక్షంలో మంగళవారం కొమురవెల్లి ముదిరాజ్ సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో సార్ల కనకయ్య, మల్లేశం తదితరులు ఉన్నారు.

కృత్తికా నక్షత్ర మహోత్సవం

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీ విద్యాసరస్వతి క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం కృత్తికా నక్షత్ర మహోత్సవం జరిగింది. వల్లి దేవసేన సమేత శ్రీ స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.


పూజలు చేస్తున్న అర్చకులు

పారిశుద్ధ్య కార్మికుల భిక్షాటన

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొన్ని నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు రాకపోవడంతో వినూత్నంగా నిరసన తెలిపారు. మంగళవారం మండలంలోని ధర్మారం, మునిగడప, పలుగుగడ్డ, మాందాపూర్, జంగంరెడ్డిపల్లి, చాట్లపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడారు. కొన్ని నెలలుగా వేతనాలు లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు.


చాట్లపల్లిలో భిక్షాటన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రైతుభరోసా అభిప్రాయ సేకరణ


మాట్లాడుతూన్న పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి


చేర్యాలలో మాట్లాడుతున్న చైర్మన్ చంద్రారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): రైతు భరోసా అభిప్రాయ సేకరణకు మంగళవారం మండలంలోని రేబర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి అధ్యక్షతన అత్యవసర మహాజన సభ నిర్వహించారు. ఈ సభలో పలువురు రైతులు మాట్లాడారు. పదెకరాలలోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు రైతు భరోసా, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, పెన్షన్, హెల్త్‌కార్డు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆడిట్ ఆఫీసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మహాజన సభలో రైతు భరోసాపై వ్యక్తం చేసిన అభిప్రాయాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. సమావేశంలో సీఈవో బోయిన శ్రీధర్, డైరెక్టర్ కొండ అంజయ్య, కర్రెడ్ల శ్రీధర్, నలుసాని మోహన్‌రెడ్డి, భూక్య జగన్, దేవునూరి దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతు భరోసా ప్రవేశ పెడుతున్నందున మంగళవారం రైతువేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలు సేకరించింది. పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు రైతులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏడీఏ టి.రాధిక, సీనియర్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, ఏఓలు అప్రోజ్, నరేష్, వైస్ చైర్మన్ నర్సయ్య, డైరెక్టర్లు బాల్‌రెడ్డి, మాదవరెడ్డి, కమలాకర్, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేరరహిత సమాజానికి చట్టాలు నాంది

హుస్నాబాద్: భారతీయ నూతన క్రిమినల్ చట్టాలు నేర రహిత సమాజానికి నాంది కావాలని న్యాయవాది జె.కిరణ్ కుమార్ అన్నారు. మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖలో భాగమైన జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల స్పెషల్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని మోడల్ స్కూల్‌లో భారతీయ న్యాయ సంహిత సెక్షన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కఠినమైన సెక్షన్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. కఠిన పరిస్థితులు ఎదురైతే మహిళలు 181 మహిళా హెల్ప్‌లైన్, పిల్లలు 1098 చైల్డ్ హెల్ప్ లైన్ సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమానికి జిల్లా సర్వశిక్ష అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ భాస్కర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ వాసవి, అడ్వకేట్ సంపత్ కుమార్, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టులు లావణ్య, పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కిరణ్‌కుమార్

దరఖాస్తుల స్వీకరణ

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి మంగళవారం తెలిపారు. ఆంగ్లం, కంప్యూటర్ సైన్స్ (2), జువాలజీ, బయోటెక్నాలజీ, ఫిజికల్ సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టులలో బోధించే అభ్యర్థులకు పీజీలో 55 శాతం ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు జులై 2 లోపు దరఖాస్తు చేసుకోవాలని, జులై 4న కళాశాలలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

మోడల్ స్కూల్‌లో..

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన బోధించుటకు ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుప్రియ మంగళవారం తెలిపారు. కామర్స్, జువాలజీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ అర్హత కలిగిన వారు శుక్రవారం పాఠశాలలో నిర్వహించే డెమోకు హాజరుకావాలన్నారు.

బైక్ ఢీ: దంపతులకు గాయాలు

మద్దూరు(హుస్నాబాద్): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. మండలంలోని వల్లంపట్ల గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముస్త్యాల రవి తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి బైక్‌పై జనగామ జిల్లా నర్మెటలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా నర్మెట–అమ్మాపూర్ గ్రామాల మధ్య ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్

హుస్నాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంతో ప్రభుత్వాలు విఫలమయ్యాయని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్ విమర్శించారు. బీజేవైఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అనేక ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేవిధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు తూముల రమేష్ ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ బెజ్జంకి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి మంగళవారం వనతి పత్రం అందజేశారు.

కొండపాకలో..

కొండపాక(గజ్వేల్): బీజేవైఎం కుకునూరుపల్లి మండల అధ్యక్షుడు ఈసాల నవీన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకిరాగానే నిరుద్యోగ సమస్యను రూపుమాపుతామన్న మాటలను మర్చిపోవడం దారుణమన్నారు. అనంతరం తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.


హుస్నాబాద్‌లో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిద్దిపేటలో..

సిద్దిపేటజోన్: నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దినేష్ ఆరోపించారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేయడం వల్లే అధికారం కోల్పోయిందన్నారు. అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగుతుందని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని గజ్వేల్ బీజేపీ, బీజేవైఎం నాయకులు ఆరోపించారు. మంగళవారం గజ్వేల్ ఐవోసీలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

మహిళల రక్షణ కోసం చట్టాలు

కొండపాక(గజ్వేల్): మహిళల రక్షణ కోసం చట్టాలు చేయబడ్డాయని సిద్దిపేట ఏసీపీ మధు పేర్కొన్నారు. మండల పరిధిలోని మర్పడ్గ హైస్కూల్లో కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా మంగళవారం మహిళల రక్షణ కోసం చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉంటే జీవితం సుఖమయంగా సాగుతుందన్నారు. బాల్య వివాహాలు అన్ని రకాలుగా అనర్థాలకు దారి తీస్తాయన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులు సైతం శిక్షార్హులవుతారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భైరయ్య, ఉపాధ్యాయులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మర్పడ్గ హైస్కూల్లో మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ మధు

దృఢత్వంలో సాటిలేని భారతి సిమెంట్

కంపెనీ టెక్నికల్ సర్వీసెస్ ఆఫీసర్ ప్రశాంత్

కొండపాక(గజ్వేల్): నిర్మాణంలో వాడే భారతి సిమెంట్ దృఢత్వంలో సాటిలేనిదని టెక్నికల్ సర్వీసెస్ ఆఫీసర్ ప్రశాంత్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో భారతి సిమెంట్ నాణ్యతపై రాజశ్రీ ట్రేడర్స్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 దేశాల్లో భారతి సిమెంట్‌ను పలు నిర్మాణాల్లో వినియోగిస్తున్నారన్నారు. వికాట్ గ్రూప్‌నకు చెందిన భారతి సిమెంట్ అల్ట్రా ఫాస్ట్ విక్రయాలు జరుగుతున్నాయన్నారు. ఇతర కంపెనీల సిమెంట్‌తో పోలిస్తే భారతి సిమెంట్ నాణ్యత ఎక్కువన్నారు. భారీ వంతెనలు, పిల్లర్లు, స్లాబ్‌లు, రహదారుల నిర్మాణాల్లో వాడుతున్నారన్నారు. భారతి సిమెంట్‌ను వాడే వారికి ఉచిత సాంకేతిక సహాయం అందించేందుకు కంపెనీ ఇంజనీర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. అందుబాటు ధరల్లో మార్కెట్లో లభిస్తున్నట్లు తెలిపారు. తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా చేయించిన భారతి సిమెంట్ కంపెనీ బీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ డీలర్ రాజు, సిమెంట్ వ్యాపారులు, తాపీ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.


బీమా పత్రాలను అందజేస్తున్న ప్రశాంత్

పొన్నాల వాసికి డాక్టరేట్

సిద్దిపేటఅర్బన్: మండలంలోని పొన్నాల గ్రామానికి చెందిన కానుగంటి ప్రభాకర్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేశారు. ఈయన రాజస్థాన్‌లోని సన్‌రైజ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ దేవేష్ కుమార్ పర్యవేక్షణలో 'ఏ రీసెర్చ్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్ ఇన్వెస్టిగేషన్ ఆన్ క్యారెక్టరైజేషన్ అండ్ బయోలాజికల్ అప్లికేషన్ ఆఫ్ కుమరిన్' అంశంపై పరిశోధన చేశారు. పరిశోధనా పత్రాలను సమర్పించడంతో యూనివర్సిటీ మంగళవారం డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రభాకర్‌ను పలువురు అభినందించారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం గ్రామంలో పదవీ విరమణ పొందిన జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఎంపీటీసీ కొలిపాక రాజును మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేష్, ఏఎన్ఎం వినోద, ఆశా వర్కర్లు సంధ్య, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్కన్నపేట రైతు వేదికలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): పదవికే విరమణ అని, ప్రజాసేవకు కాదని ఎంపీపీ మాలోతు లక్ష్మీ అన్నారు. అక్కన్నపేట రైతు వేదికలో మంగళవారం పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీ సభ్యులకు ఎంపీడీఓ భానోతు జయరాం అధ్యక్షతన సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఐదేళ్లుగా పార్టీలకతీతంగా పనిచేశారన్నారు. అనంతరం ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, మిషన్ భగీరథ డీఈ బాలరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మౌనిక, సీడీపీఓ జయమ్మ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీటీసీలను సన్మానించిన ఎంపీడీఓ జయరాం

సంక్షిప్త వార్తలు

◆ ఫిషరీస్ కమిషనర్‌కు వినతి

కొండపాక(గజ్వేల్): రాష్ట్ర ఫిషరీస్ కమిషనర్ ప్రియాంకను మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసినట్లు కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామానికి చెందిన రాష్ట్ర ముదిరాజ్ సమాజ్ వ్యవస్థాపక కమిటీ సభ్యుడు దాసరి భాను ప్రకాశ్ తెలిపారు. ముదిరాజ్‌ల సమస్యలను కృషి చేయాలని కోరామన్నారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

◆ బీజేపీ నాయకుడి మృతి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు పిన్నింటి రాజు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. రాజు పార్థివదేహాన్ని మంగళవారం స్వగ్రామం తరలించారు. పెద్దపెల్లి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఓదేలు, ఫ్యాక్స్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు తదితరులు సంతాపం ప్రకటించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

◆ ఆలయ పునః నిర్మాణానికి విరాళం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ గ్రామంలో పంచముఖలింగ సోమేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణం జరుగుతోంది. దాతలు మంగళవారం విరాళం అందజేశారు. ఆదిమూల సత్యనారాయణ రూ.50116, సమ్మెట శ్రీనివాస్ రూ.15116, బేజుగాం శంకరయ్య రూ.1116 అందజేసినట్లు ఆలయ బాధ్యులు తలిపారు.

◆ పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దూరం

గజ్వేల్‌రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ జకీయొద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 8వ వార్డు బీసీ కాలనీ, పాత ఎంపీడీఓ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో డ్రైడేలో భాగంగా ఇంటింటికి తిరిగి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

◆ ఎస్ఐ బదిలీ

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల ఎస్ఐ తాండ్ర వివేక్ మంగళవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈయన 25 నెలలు మండలంలో పనిచేశారు. వివేక్ స్థానంలో ఎవరూ రాలేదు.

◆ జట్కా పద్ధతిలో నైవేద్యం సమర్పించాలి

సిద్దిపేటజోన్: ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు మేకలు, కోళ్లను జట్కా పద్ధతిలో నైవేద్యంగా సమర్పించాలని, అది ఆచారమని హిందూ వాహిని ప్రతినిధులు భూమిరెడ్డి, సత్యం పేర్కొన్నారు. మంగళవారం శివాజీ చౌక్ వద్ద గ్రామీణ దేవతలకు హలాల్ పద్ధతిలో ఇవ్వొద్దని నిరసన తెలిపారు. గ్రామీణ సంప్రదాయం మరచిపోవద్దన్నారు.

◆ మట్టి అక్రమ తరలింపుపై ఫిర్యాదు

ములుగు(గజ్వేల్): మండలంలోని తున్కిబొల్లారంలో అర్ధరాత్రి మట్టిని అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ భవానీకి వినతి పత్రం అందజేశారు. సోమవారం రాత్రి మట్టిని తరలిస్తుండటంతో కొత్తపేట రవీందర్‌రెడ్డితో పాటు మరికొందరు వాహనాలను అడ్డుకోగా వారిపై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు.

◆ 6న వేలం పాట

చిన్నకోడూరు(సిద్దిపేట): వివిధ పోలీస్ స్టేషన్‌లలో డ్యామేజ్ అయిన వస్తువుల విడిభాగాలను ఈనెల 6వ తేదీన మండల పరిధిలోని పెద్దకోడూరు శివారు సీఏఆర్‌హెడ్ క్వార్టర్‌లో వేలం వేయనున్నట్లు సిద్దిపేట సీపీ అనురాధ మంగళవారం తెలిపారు. డ్యామేజ్ అయిన ఫర్నిచర్, ర్యాక్స్, ఇన్వర్టర్స్, బోర్ మోటార్స్, కంప్యూటర్స్, మానిటర్స్, పవర్ బాక్స్, జిరాక్స్ మిషన్‌లు, వినియోగించిన పోలీస్ వాహనాల బ్యాటరీలు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు శనివారం ఉదయం 10 గంటల వరకు వేలం పాట నిర్వహించే ప్రదేశానికి రావాలని, వచ్చేటప్పుడు తమ ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. వస్తువులు దక్కించుకున్న వారు వెంటనే నగదు చెల్లించి వస్తువులు తీసుకుని వెళ్లొచ్చన్నారు. రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ పూర్ణచందర్ (8712667416)ను సంప్రదించాలన్నారు.

◆ నిబంధనలు పాటించాలి

రాయపోలు(దుబ్బాక): వాహనదారులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని రాయపోలు ఎస్ఐ రఘుపతి హెచ్చరించారు. మండలంలోని చిన్నమాసాన్‌పల్లి వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అలాగే ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు.

◆ మారథాన్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మిరుదొడి(దుబ్బాక): జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో ఈనెల 28వ తేదీన నిర్వహించే హాఫ్ మారథాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పర్శరాములు కోరారు. మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో సిద్దిపేట 2వ ఎడిషన్ ఆఫ్ మారథాన్ వాల్ పోస్టర్‌ను సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ బాధ్యుడు కాస రాజు, ఉమ్మడి జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్యతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాఫ్ మారథాన్‌లో 5, 10, 21.2 కిలోమీటర్ల కేటగిరిలో పోటీలు జరుగుతాయన్నారు. ఈనెల 10వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

◆ కొత్త చట్టాలతో ప్రజాస్వామ్యం ఖూనీ

గజ్వేల్‌రూరల్: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా కొత్త చట్టాలున్నాయని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ నూతన చట్టాల్లోని కొన్ని సెక్షన్లు ప్రాథమిక హక్కులను భంగం కలిగించేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలతో చర్చించకుండా ప్రజలకు, ప్రజాస్వామ్యవాదులకు సమాచారం లేకుండా ఈ చట్టాలను ఎందుకు అమలు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు.

◆ పౌష్టికాహారం అందించాలి

దుబ్బాకటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని 2వ వార్డు కౌన్సిలర్ దేవలక్ష్మి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల ఎత్తు, బరువు కొలిచారు.